సాక్షి
ఖమ్మం
సోమవారం । 19 । జూన్ । 2023



వృద్ధిలో దూసుకెళ్తున్న సుడా

స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పడ్డాక ఖమ్మం నగరం, చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. IIలో



ట్రావెల్ బస్సు బోల్తా

ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై నాయకన్‌గూడెం వద్ద ఆదివారం ట్రావెల్ బస్సు బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. IIలో

గరిష్ఠం / కనిష్ఠం
40° / 29°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రత సాధారణంగా ఉంటుంది. రాత్రిపూట మాత్రం వాతావరణం వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నవోదయలో ఎన్‌సీసీ శిక్షణ ప్రారంభం



ఫైరింగ్‌కు సిద్ధమవుతున్న కేడెట్లు

కూసుమంచి : తెలంగాణా ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో ఆదివారం నుంచి ఈనెల 27 వరకు ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో ఖమ్మం, భద్రాచలం, పాల్వంచతో పాటు వరంగల్ జిల్లా నుంచి 280 మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొంటున్నారు. 11వ తెలంగాణా ఎన్‌సీసీ బెటాలియన్, ఖమ్మం ఏఓ లెఫ్టినెంట్ కల్నల్ సునీల్ యాదవ్ పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరంలో 10 మంది ఎన్‌సీసీ అధికారులు, మరో 10 మంది ఆర్మీ అధికారులు పలు అంశాల్లో కేడెట్లకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ చంద్రబాబు తెలిపారు.

నేటి గ్రీవెన్స్‌డే రద్దు

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో అధికారులు పాల్గొంటున్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి(గ్రీవెన్స్‌డే)ను రద్దు చేసినట్లు కలెక్టర్ వి.పి. గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

జమలాపురం ఆలయంలో గోపూజ



గోమాతకు పూజలు చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారికి, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లకు నిత్యపూజలతో పాటు ఆలయ ప్రాంగణంలోని గోశాలలో ఆవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ, సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్, ముఖ్య అర్చకులు ఉప్పల సుదర్శనశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో మరో 102 ఆలయాలకు డీడీఎన్

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మరో 102 ఆలయాలకు ధూప దీప నివేదన పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఖమ్మం జిల్లాలో 67, భద్రాద్రి జిల్లాలో 35 ఆలయాల్లో డీడీఎన్ స్కీమ్ అమలు కానుంది. ఇప్పటి వరకు ఖమ్మం జిల్లాలో 220 ఆలయాల్లో ఈ పథకం అమలులో ఉండగా, నూతనంగా మంజూరైన వాటితో కలిపి 287కు పెరిగింది. భద్రాద్రి జిల్లాలో 80 ఆలయాల్లో పథకం అమల్లో ఉండగా కొత్తగా వచ్చే 35 ఆలయాలతో కలిపి 115కు చేరింది. ఈ సందర్భంగా జిల్లా అర్చక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మునగలేటి రమేష్ శర్మ, మరింగంటి భార్గవాచార్యులు మాట్లాడుతూ.. జిల్లాలో అనేక దేవాలయాలు ఈ పథకానికి అర్హత కలిగి ఉన్నాయని, మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో తక్కువ సంఖ్యలో పథకం మంజూరైందని ఆవేదన వ్యక్తం చేశారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఆదివారం వైభవగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. నిత్య కల్యాణ వేడుకలోనూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మళ్లీ టికెట్ దక్కేనా?

జిల్లాలోని బీఆర్‌ఎస్ సిట్టింగ్‌ల్లో గుబులు

- ప్రధానంగా వైరా, పాలేరుపై చర్చ
- ఈ రెండింట్లో తమకే టికెట్ అని ప్రస్తుత ఎమ్మెల్యేల ధీమా
- ఎన్నికల నాటికి చిత్రం మారుతుందంటున్న ఆశావహులు



సాక్షిప్రతినిధి, ఖమ్మం : జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఎంతమంది వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారనే దానిపై ఆసక్తికర చర్చ సాగుతోంది. ఇప్పటికే పలు సర్వేల ద్వారా సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేల పనితీరు మదింపు చేసినట్లు సమాచారం. అయితే ఈ నివేదికల ఆధారంగా ఇటీవల జరిగిన సమావేశంలో పనితీరు మార్చుకోవాలంటూ కొందరికి వ్యక్తిగతంగా చురకలు అంటించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రధానంగా వైరా, పాలేరు నియోజకవర్గాలు హాట్‌టాపిక్‌గా మారాయి. ఈ రెండు స్థానాల్లో ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు మళ్లీ తామే పోటీలో ఉంటామన్న ధీమాతో ఉన్నారు. అయితే ఈ నియోజకవర్గాల్లో ఆశావహులు కూడా టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాల్లో మునిగారు. దీంతో చివరకు సర్వేల జాతకంతో సిట్టింగ్‌లకు సీట్లు దక్కుతాయా.. లేక ఆశావహుల్లో ఎవరికైనా అదృష్టం కలిసొస్తుందా..? అనే చర్చ ఆ పార్టీలో సాగుతోంది.

బీఆర్‌ఎస్‌కు జిల్లా కీలకం..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మరోసారి రాష్ట్ర పగ్గాలు చేపట్టాలని భావిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో గెలిచే అభ్యర్థులనే బరిలోకి దింపాలనే దృఢ నిశ్చయంతో ఉన్నారని తెలుస్తోంది. గత రెండు ఎన్నికల్లో జిల్లాలో బీఆర్‌ఎస్ ప్రభావం చూపలేకపోయింది. ఈ క్రమంలో ఈసారి పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే లక్ష్యంతో ముఖ్యమంత్రి జిల్లాపై ఫోకస్ పెట్టారు. ఇందుకోసం జిల్లాలో పలు సంస్థలతో సర్వేలు నిర్వహింపజేశారు. ఈ సర్వేల్లో వచ్చిన ఫలితాల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని సమాచారం. పనితీరు బాగోలేకపోయినా.. గెలిచే అవకాశాలు లేకపోయినా సిట్టింగ్‌లకు ఎట్టి పరిస్థితుల్లో టికెట్ దక్కే అవకాశం లేదు.

వైరా బీఆర్‌ఎస్‌లో త్రిముఖ పోటీ..

బీఆర్‌ఎస్‌లో నాయకుల సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే ప్రధానంగా వైరా, పాలేరు నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు వారు టికెట్లు ఆశిస్తున్నారు. వైరా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ఉన్నారు. గత ఎన్నికల్లో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి ఇద్దరు నేతలు పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, మరో మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి టికెట్ల కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వీరు గత కొన్ని నెలలుగా ఎమ్మెల్యే రాములునాయక్‌తో పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా వీరు ముగ్గురు వేర్వేరుగానే చేపట్టడం పరిపాటిగా మారింది. ఈసారి ఎలాగైనా టికెట్ సాధించాలనే పట్టుదలతో మదన్‌లాల్, చంద్రావతి పని చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరి వ్యవహారం రాములునాయక్‌కు తలనొప్పిగా మారింది. ఈ క్రమంలో ఈ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాములునాయక్‌కు దక్కుతుందా.. లేక వీరిద్దరిలో ఒకరికి దక్కుతుందా.. ఇవేమీ కాకుండా మరో అభ్యర్థిని ఎంపిక చేస్తారా..? అనే ప్రచారం జోరందుకుంది.

కందాల వర్సెస్ తుమ్మల..

ఈసారి తనకు టికెట్ ఖాయమంటూ పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడ బీఆర్‌ఎస్‌లోనే రెండు వర్గాలు ప్రచ్ఛన్నయుద్ధం చేస్తున్నాయి. తుమ్మల, కందాల వర్గీయుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలున్నాయి. గత ఎన్నికల్లో కందాల ఉపేందర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందగా.. తుమ్మల బీఆర్‌ఎస్ తరఫున బరిలో నిలిచారు. గెలుపొందిన అనంతరం కందాల బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి నుంచి వీరి వర్గాల మధ్య సయోధ్య కుదరడం లేదు. ఇదిలా ఉండగా.. బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటే పాలేరు సీటు తమకు కేటాయించాలని సీపీఎం కూడా కోరుతోంది. ఈ పరిస్థితులతో ఈ నియోజకవర్గంపై కూడా రాజకీయ విశ్లేషణ జోరుగా సాగుతోంది. ఓ వైపు కందాల వర్గం తామే పోటీలో ఉంటామంటూ ఖరాఖండిగా చెబుతోంది. కాగా తుమ్మల వర్గం కూడా ఎన్నికల సమయానికి చిత్రం మారుతుందని, తమ నేతకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటోంది.

ఎమ్మెల్యేల్లో హైరానా..

వచ్చే ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవడంపైనే బీఆర్‌ఎస్‌లోని సిట్టింగ్ ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. ప్రధానంగా వారి పనితీరుపై సీఎం కేసీఆర్ సర్వేలు చేయించడం.. వీటి ఆధారంగా ఇప్పటికే ఓ సమావేశంలో హెచ్చరికలు కూడా జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లాలోని కొందరు సిట్టింగుల్లో ఇప్పటికే ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో మొత్తం ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా.. మధిర నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఖమ్మం, సత్తుపల్లి, వైరా, పాలేరు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఖమ్మం, సత్తుపల్లిల్లో పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలుండగా.. ఇక్కడ వారే కీలకంగా ఉన్నారు. ఈ నియోజకవర్గాల నుంచి ఆశావహులు ఎవరూ లేరు. అయితే పాలేరు, వైరాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలున్నా ఆశావహుల నుంచి పోటీ మాత్రం తీవ్రంగానే ఉంది.

తాగునీటి కష్టాలు తీరాయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్సీ మధు తదితరులు

ఎమ్మెల్యే కందాల, కలెక్టర్ గౌతమ్

కూసుమంచి : తెలంగాణా ఆవిర్భావం తర్వాత ఆడబిడ్డల తాగునీటి కష్టాలను మిషన్ భగీరథ ద్వారా సీఎం కేసీఆర్ దూరం చేశారని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. తెలంగాణా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జీళ్ల చెరువులోని మిషన్ భగీరథ ప్రాజెక్టు వద్ద నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇదివరకు గుక్కెడు తాగునీటి కోసం జనం అల్లాడేవారని, వ్యవసాయ బావుల వద్ద, ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకునే వారని అన్నారు. తెలంగాణా వచ్చాక సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో ఇంటింటికీ నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుతోందన్నారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల్లో పల్లెలు చుక్క నీటి కోసం అల్లాడేవని, నేడు ఏ ఇంట చూసినా మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతోందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, మిషన్ భగీరథ సీఈ శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఎంపీపీలు బాణోత్ శ్రీనివాస్ నాయక్, బెల్లం ఉమ, వజ్జా రమ్య, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వం.. హరితమయం

- నేటి నుంచి తొమ్మిదో విడత హరితహారం
- ఎనిమిదేళ్లల్లో నాటిన మొక్కలు 9.89 కోట్లు

ఖమ్మంమయూరిసెంటర్: వానలు వాపస్ రావాలన్నా.. కోతుల అడవులకు వెళ్లాలన్నా అటవీ విస్తీర్ణం పెరగాలని, మొక్కలు పెంచాలని సీఎం కేసీఆర్ 2015 జూన్‌లో హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం గత 8 విడతల్లో మొక్కలను విరివిగా నాటడంతో జిల్లాలోని పల్లెలు, పట్టణాలు పచ్చదనంతో పరిఢవిల్లుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో 8 విడతల్లో కలిపి 9,89,85,700 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం ప్రారంభించిన తొలినాళ్లల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో కొన్ని, డీఆర్డీఏ ఆధ్వర్యంలో మరికొన్ని నర్సరీలను మండలానికి రెండు, మూడు చొప్పున ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు. వాటి నుంచి గ్రామాలకు మొక్కలు సరఫరా చేసేవారు. అయితే జిల్లాలో నాటాల్సిన మొక్కల లక్ష్యాలను ప్రభుత్వం పెంచడంతో 2017 – 18 నుంచి నర్సరీల సంఖ్య పెంచారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో గ్రామానికి ఒక నర్సరీ ఏర్పాటు చేసి అవసరమైన మొక్కలను అక్కడే పెంచుతున్నారు. దీంతో 2017 నుండి 2019 వరకు జిల్లాలో ప్రతి ఏటా హరితహారంలో 2 కోట్ల మొక్కలను నాటగలిగారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు..

హరితహారం విజయవంతానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీ శాఖ కీలకంగా వ్యవహరించాయి. జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచేందుకు ఆయా అధికారులు చర్యలు చేపట్టారు. 2014–15 నుండి 2022–23 వరకు జిల్లాలో 3,842.55 ఎకరాల్లో మొక్కలు నాటారు. 2023లో 9వ విడత హరితహారంలో 7.74 లక్షల మొక్కలను నాటేందుకు సిద్ధం చేశారు. ఖమ్మం, సత్తుపల్లిలో ప్రత్యేకంగా అర్బన్ పార్క్‌లు ఏర్పాటు చేశారు.

నేటి నుండి తొమ్మిదో విడత..

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరిత ఉత్సవం నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. ప్రతి పల్లె, పట్టణంలో మొక్కలు నాటాలని ఆదేశించింది. ఈ ఏడాది నిర్వహించే 9వ విడత హరితహారం ఈ ఉత్సవం సందర్భంగా నేటి నుంచి ప్రారంభం కానుంది.

ఉత్తమ పంచాయతీగా రఘునాథపాలెం

నేడు హైదరాబాద్‌లో అవార్డు అందుకోనున్న సర్పంచ్, కార్యదర్శి



రఘునాథపాలెంలోని సుడా పార్కు

రఘునాథపాలెం: హరితహారం కార్యక్రమంలో జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీగా మండల కేంద్రమైన రఘునాథపాలెం ఎంపికై ంది. ఈ మేరకు అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో జరిగే వేడుకల్లో మంత్రులచే అవార్డు అందుకునేందుకు రావాలని సర్పంచ్ గుడిపుడి శారద రామారావు, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్‌కు సమాచారం అందింది. గత ఏడాది పంచాయతీలో హరితహారం కార్యక్రమం ద్వారా మండల బృహత్తర పల్లె ప్రకృతి వనం, గ్రామ పకృతి వనం, చెరువుకట్టలు, ప్రభుత్వ కార్యాలయాలు, నూతన కాలనీలు, గ్రీన్ బెల్ట్ స్థలాల్లో సుమారు లక్ష మొక్కలు నాటినందుకు గాను అటవీశాఖ ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసినట్లు తెలిసింది. సుడా పార్కులో అత్యధికంగా 20 వేలకు పైగా వివిధ రకాల మొక్కలు నాటడంతో పాటు, అత్యధికంగా మొక్కలను సంరక్షించినందుకు గాను ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఈ సందర్భంగా సర్పంచ్ శారద మాట్లాడుతూ.. జిల్లాలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులతో సమన్వయం చేసి తమతో మొక్కలు నాటించడం వల్లే నేడు మంచి ఫలితాలు అందుకుంటున్నామని అన్నారు.

ఊరూరా పుస్తక ప్రదర్శన

జూలూరు గౌరీశంకర్



మాట్లాడుతున్న జూలూరు గౌరీశంకర్

ఖమ్మంమయూరిసెంటర్: ఊరూరా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తామని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గత వారం రోజులుగా లకారం ట్యాంక్ బండ్ వద్ద వైభవంగా సాగిన పుస్తక మహోత్సవం ఆదివారం ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన గౌరీశంకర్ మాట్లాడుతూ జ్ఞాన తెలంగాణ నిర్మాణంలో పుస్తకం కీలకంగా మారుతుందన్నారు. అందుకు గ్రామ గ్రామానికి పుస్తక ప్రదర్శనను తీసుకువెళ్తామని, దాంతో గడప గడపకూ పుస్తకం చేరుతుందని తెలిపారు. కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో వచ్చిన పరికరాలు ఎన్ని ఉన్నా పుస్తకాన్ని మించిన జ్ఞాన భాండాగారం లేదన్నారు. వినూత్న ఆలోచనలు రావాలంటే పుస్తకాలను తప్పకుండా చదవాలని, తల్లిదండ్రులు పిల్లలను పాఠకులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ప్రముఖ కవి ప్రసేన్, కవి సీతారాం, ఐ.వి. రమణారావు, తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి కోయ చంద్రమోహన్, వి.దామోదర్, నామా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢం వచ్చేసింది..

- పుట్టింటికి చేరుకున్న కొత్త కోడళ్లు
- అమ్మవారి బోనాలకు విశిష్టమైన మాసం





ఖమ్మంవ్యవసాయం: తెలుగు మాసాల్లో నాలుగోది అయిన ఆషాఢ మాసం సోమవారం ప్రారంభం కానుంది. ఎలాంటి శుభకార్యాలు తలపెట్టకున్నా.. ఈ మాసానికి అనేక ప్రత్యేకతలు, విశిష్టతలు ఉన్నాయి. కొత్తగా పెళ్లయిన వధువులు పుట్టింటికి చేరుకుంటారు. కొత్త అల్లుళ్లను అత్తవారింట అడుగు పెట్టనివ్వరు. సూర్యుడు పుణ్యకాలం ఉత్తరాయణంలో ముగించుకుని దక్షిణాయణంలో మొదలవుతుంది. ఈ మాసంలో వర్షాలు కురుస్తాయని, వ్యాధులు ప్రబలుతాయనే ఉద్దేశంతో ఎలాంటి శుభకార్యాలు తలపెట్టక పోవటం ఆనవాయితీ. ముఖ్యంగా ఈ మాసంలో పెళ్లిళ్లు, నిశ్చితార్థాలు, గృహ ప్రవేశాలు, వేడుకలు నిర్వహించరు. భక్తులు చాతుర్మాస వ్రతాలు ఆచరిస్తారు. పూరీ జగన్నాథ రథయాత్ర, కుసుమహార జయంతి, బోనాల జాతర, సంకటహరి చతుర్థి వంటి పండుగలు ఈనెలలో జరుపుకుంటారు.

బోనాలకు విశిష్టత..

ఆషాఢ మాసం అంటే తెలంగాణ రాష్ట్రంలో బోనాలకు విశిష్టత. ఈ మాసంలో వివిధ ప్రాంతాల్లో అమ్మవార్లకు బోనాలతో నైవేద్యం సమర్పిస్తారు. కొన్ని ప్రాంతాల్లో శ్రావణ మాసంలో కూడా బోనాలు చెల్లిస్తారు. కొత్త పెళ్లి కూతుర్లు, ఆడబిడ్డలు ఇళ్లకు చేరిన వేళ ఈ బోనాల జాతరను అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. వర్షాలు కురిసే ఈ కాలంలో వ్యాధులు సోకకుండా ఇంటిని శుభ్రం చేసుకుని, మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టుకుంటారు. మహిళలు కాళ్లకు పసుపుతో పారాణి రాసుకుంటారు. ఆషాఢ మాసంలో గ్రామాల్లో బోనాల జాతర్లు కనువిందు చేస్తాయి. ఓ వైపు వర్షాలు, పంట పొలాల సాగు, ఇళ్లలో ఆడపిల్లల సందడితో అంతా ఆనందంగా ఉంటారు.

గోరింటాకుకు ప్రత్యేకం..

ఆషాఢ మాసం అంటే ఆడపిల్లలకు ఎంతో ఇష్టం. ఈ మాసంలో అలంకరణకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటారు. ఈ మాసంలో కాళ్లు, చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు. కొందరు మెహందీ పేరిట ప్రత్యేకంగా అలంకరణ చేసుకుంటారు. గోరింటాకు అలంకరణతో అందంతో పాటు ఆరోగ్యానికి కూడా మంచిదని నిపుణులు చెబుతున్నారు.

ప్రత్యేక మాసం.. ఆషాఢం



మిగిలిన తెలుగు మాసాలతో పోలిస్తే ఆషాఢ మాసం ప్రత్యేకమైంది. గ్రీష్మ రుతువులో ఈ మాసం వస్తుంది. ఈ మాసంలో వాతావరణ పరిస్థితులు భిన్నంగా, ప్రతికూలంగా ఉంటాయి. వర్షాలు కురవడం, కొత్త సూక్ష్మ జీవుల కారణంగా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ ప్రతికూలతలను దృష్టిలో పెట్టుకొని కొత్త పెళ్లి జంటలను దూరంగా ఉంచడం ఆనవాయితీ. ఈ నెలలో పుట్టింటికి చేరిన ఆడపిల్లలు ఆనందంగా గడుపుతారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడం ఈనెలలో ఆనవాయితీ.

– ఆమంచి సురేష్ శర్మ, అర్చకులు, ఖమ్మం

క్లుప్తంగా

మాణిక్‌రావ్ ఠాక్రేతో జిల్లా నేతల భేటీ



మాట్లాడుతున్న రేణుకాచౌదరి, ముస్తఫా తదితరులు

ఖమ్మంసహకారనగర్: ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్‌ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంలో త్వరలో రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ భారీ బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో జన సమీకరణ తదితర అంశాలపై సూచనలు చేశారు. కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, ఎండీ ముస్తఫా, డాక్టర్ మట్టా దయానంద్, రామ్మూర్తినాయక్, నున్నా రామకృష్ణ, యడవల్లి కృష్ణ వారిని కలిసిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి ప్యాసింజర్ రైళ్లు రద్దు

ఖమ్మంమామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసింది. ఈనెల 19 నుంచి 25 వరకు విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే రైళ్లను రద్దు చేసినట్లు సీసీఐ జాఫర్ తెలిపారు. 07755, డోర్నకల్ – విజయవాడ, 07756 విజయవాడ – డోర్నకల్, 07278 భద్రాచలం రోడ్ – విజయవాడ, 07279 విజయవాడ – భద్రాచలం రోడ్ ప్యాసింజర్లు రద్దు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు రైల్వే శాఖకు సహకరించాలని కోరారు.

ఆయిల్ పామ్ తోటకు మరోసారి నిప్పు

మధిర: మధిర పట్టణ సమీపంలోని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డికి చెందిన ఆయిల్‌పామ్ తోటకు శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మరోసారి నిప్పంటించారు. దీంతో ఆ తోటలో మంటలు వ్యాపించి ఆయిల్‌పామ్ చెట్లు దగ్ధమయ్యాయి. రెండు రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తులు 30 ఎకరాల తోటకు నిప్పంటించగా సుమారు 4 ఎకరాల పరిధిలో ఉన్న ఆయిల్‌పామ్ చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఫైర్ ఇంజన్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయంపై బాధిత రైతు మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మరోసారి ఘటనకు పాల్పడడంతో ఆయిల్‌పామ్ చెట్లు మరికొన్ని దగ్ధమయ్యాయి. వరుస ఘటనలపై పోలీసులు విచారణ జరిపి నిందితులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఏలూరి నాగేశ్వరరావు, చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేశ్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు.

ఇంకుడుగుంతలో పడి ఆవు మృతి



ఇంకుడుగుంతలో కూరుకుపోయి మృతిచెందిన ఆవు

రఘునాథపాలెం: మండలంలోని బద్యాతండాలో ఇంకుడుగుంతలో పడి బానోత్ శ్రీనుకు చెందిన ఆవు ఆదివారం మృత్యువాత పడింది. స్థానికుల కథనం ప్రకారం.. ఇంకుడుగుంత తొవ్వి దాంట్లో రాళ్లు, ఇసుకతో పూడ్చకుండా అలాగే ఉంచారు. ఆ నీటిలో రాత్రి సమయంలో ఆవు తలభాగం మునికి తెల్లవారే సరికి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. పంచాయతీ పాలకుల నిర్లక్ష్యంతోనే ఆవు మృతి చెందిందని బాధిత రైతు ఆరోపిస్తున్నాడు. గ్రామ కార్యదర్శి బాధ్యత వహించి రైతుకు పరిహారం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రామయ్య భూముల్లో ఆక్రమణలు తొలగింపు

భద్రాచలంటౌన్: భద్రాచలం రామయ్య భూముల్లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను దేవస్థానం అధికారులు తొలగించడంతో పాటు వారిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవస్థానం ఈఓ రమాదేవి కథనం ప్రకారం.. ఏపీలోని ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని సర్వే నంబర్–3లోని గోశాల వద్ద గల భూమిలో కొందరు ఆక్రమణదారులు మట్టిని ట్రాక్టర్ల ద్వారా తొలగించి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేసిన్నట్లు దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. దీంతో వారిపై ఎటపాక పోలీసులకు ఫిర్యాదు చేయగా జేసీబీతో పాటు ఆక్రమణదారులపై కేసు నమోదు చేశారని ఈఓ తెలిపారు. దేవస్థానాల భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,346

వృద్ధిలో దూసుకెళ్తున్న ప్రతీ వాడా

- సుడాతో నగరంలో మెరుగైన అభివృద్ధి
- మూడు వసంతాలు పూర్తి చేసుకున్న పాలకవర్గం



గతేడాది రఘునాథపాలెంలో సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పడిన తర్వాత ఖమ్మం నగరంతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. 2017 అక్టోబర్ 24న రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వైరా మున్సిపాలిటీ, కూసుమంచి, ఖమ్మం రూరల్, ముదిగొండ, చింతకాని, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లోని 46 గ్రామ పంచాయతీలతో 573 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో సుడాను ఏర్పాటు చేసింది. సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ సారథ్యంలో 14 మంది డైరెక్టర్లతో నూతన పాలవర్గాన్ని ఏర్పాటు చేసింది. ఈ పాలకవర్గం ఏర్పడిన తర్వాత సుడాలోని ఖమ్మం కార్పొరేషన్, ఇతర ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచనలతో సుడాకు వస్తున్న నిధులను ఆయా ప్రాంతాలకు కేటాయిస్తున్నారు.

రూ.43.47 కోట్లతో అభివృద్ధి పనులు..

పాలకవర్గం ఏర్పడిన తర్వాత సుడాకు వస్తున్న ఆదాయంతో సుడా పరిధిలోని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.43.47 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ పనులకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేయగా.. ఇప్పటివరకు 90 శాతం పనులను పూర్తి చేశారు. ప్రధానంగా శ్రీశ్రీ సర్కిల్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ గ్రీనరీ ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డివైడర్లు, గ్రీనరీ, సుడా మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేశారు. రఘునాథపాలెంలో సుడా పార్కును, కలెక్టరేట్‌లో ల్యాండ్ స్కేపింగ్‌తో పార్కును ఏర్పాటు చేశారు.

నూతన మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు దశాబ్దాల కిందట రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఉండేది. సుడా ఏర్పడిన తర్వాత సుడా పరిధిలోని అన్ని ప్రాంతాలను కలుపుకొని నూతన మాస్టర్ ప్లాన్‌కు పాలకవర్గం, అధికారులు శ్రీకారం చుట్టారు. రాబోయే 20 సంవత్సరాలకు అన్ని రకాలుగా అవసరం పడేలా ఈ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. ఇప్పటికే ప్లాన్ ముసాయిదా పూర్తి కావొచ్చింది. సుడా పరిధిలో వెంచర్లకు అనుమతులు మంజూరు చేయడంలో ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ, నిర్వాహకులకు వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. లేఔట్లకు ఇస్తున్న అనుమతుల ద్వారా సుడాకు రూ.60 కోట్ల నిధులు ఫీజుల రూపంలో సమకూరాయి. ఇక 10 శాతం గ్రీన్ ఓపెన్ స్పేస్ కింద సుడాకు 100 ఎకరాల స్థలం సమకూరింది.

సుడాతో మరింత అభివృద్ధి..

ఖమ్మం నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల అభివృద్ధిలో సుడా ముఖ్య భూమిక పోషిస్తోంది. సుడా ఏర్పడిన తర్వాత ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు పెరిగాయి. సీసీ రోడ్లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశాం. సుడా పేరుతో రఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన పార్క్ అద్భుతంగా ఉంది. పాలకవర్గం సహకారంతో సుడాలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

– బచ్చు విజయ్‌కుమార్, సుడా చైర్మన్

యోగా దినోత్సవంపై ముమ్మర ప్రచారం



ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెవిలియన్ గ్రౌండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బుడిగం శ్రీనివాసరావు, శ్యామ్‌బాబు, వెంకట్, దుర్గేష్, సుదర్శన్‌రావు, నర్సింహారావు, సంధ్య, కుసుమ, జగన్‌మోహన్, హరి కృష్ణారెడ్డి, మాధవి, కళావతి, అమృత, రాణి శ్రీనివాస్, ప్రవీణ్, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు బోల్తా

ఏడుగురికి గాయాలు



బోల్తాపడినన ట్రావెల్స్ బస్సు

కూసుమంచి : ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం నాయకన్‌గూడెం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఓ ట్రావెల్స్ బస్సు బోల్తా పడగా డ్రైవర్‌తో పాటు ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. శ్రీ కేవీఆర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు 35 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతుండగా నాయకన్‌గూడెం సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ శ్రీనివాస్‌తో పాటు సునీల్, దీపక్, జ్యోతి, గోపి, నరేష్, షేక్ సద్దాం అనే ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరగగానే సమీపంలోనే ఉన్న హైవే రెస్క్యూ టీం, పోలీసులతో పాటు ఇతర వాహనదారులు బస్సు అద్దాలు పగులగొట్టి ప్రయాణికులను బయటకు తీశారు. గాయపడిన వారిని హైవే 1033 అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ప్రమాదానికి అర్ధగంట ముందు కేవీఆర్ ట్రావెల్స్‌కు చెందిన మరో బస్సు హైదరాబాద్ నుంచి తిరువూరు వెళుతూ నాయకన్‌గూడెం దాటిన తర్వాత హైవే సెంట్రల్ ప్లాంటేషన్ డ్రైయినేజీలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం దెబ్బతినగా ఎవరికీ ప్రమాదం జరుగలేదు. కాగా బస్సుల ప్రమాద స్థలాన్ని ఖమ్మం ఎంవీఐ వరప్రసాద్ సందర్శించి ఫిట్‌నెస్‌ను తనిఖీ చేశారు. ఈ ఘటనపై కూసుమంచి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

బోనకల్: బోనకల్ గ్రామానికి చెందిన పారుపల్లి సత్యనారాయణచారి (65) ఆదివారం వడదెబ్బతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు రావుట్ల సత్యనారాయణ, పంతంగి శ్రీనివాసరావు, రావుట్ల వెంకటాచారి సందర్శించి నివాళులర్పించారు.

మరో యువకుడు...

కారేపల్లి: వడదెబ్బతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గేటు రేలకాయలపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుంపెన్న ప్రభాకర్ (35) శనివారం గ్రామంలో వ్యవసాయ కూలి పనులకు వెళ్లాడు. అదేరోజు సాయంత్రం వడదెబ్బ తగలటంతో వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ప్రభాకర్‌ను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స నిర్వహించారు. ఆదివారం తీవ్రమైన జ్వరం, వాంతులు కావటంతో ఇల్లెందు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ప్రమాదవశాత్తు బావిలో పడి..

ఖమ్మంరూరల్: మండలంలోని తనగంపాడుకు చెందిన నంద్యాల సైదులు (40) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. సైదులు గొర్రెలు మేపడానికి ఆదివారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ చెరువు పక్కనే బావిలోకి కాళ్లు కడుక్కోడానికి దిగాడు. కాలు జారి బావిలో పడిపోయి మృతిచెందాడు. అక్కడే ఉన్న నంద్యాల నాగరాజు కుటుంబ సభ్యులు అగ్నిమాపక దళానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

రైల్లో నుంచి దూకి గుర్తుతెలియని వ్యక్తి..

ఖమ్మంక్రైం: రైల్లో నుంచి దూకి గుర్తుతెలియని (40) వ్యక్తి మృతిచెందిన ఘటన ఖమ్మం రైల్వేస్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై చోటుచేసుకుంది. జీఆర్‌పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. చైన్నై నుంచి ఢిల్లీ వెళ్తున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌కు ఖమ్మంలో హాల్టింగ్ లేకపోవడంతో ప్లాట్‌ఫాం పైనుంచి లూప్‌లైన్‌లో నెమ్మదిగా వెళ్తోంది. గుర్తుతెలియని వ్యక్తి రైల్లో నుంచి దూకి మృతి చెందాడు. దీంతో అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'ప్రైవేట్' సత్తా

● న్యూవిజన్ ప్రభంజనం

ఖమ్మంసహకారనగర్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. ఓపెన్ కేటగిరిలో జి.నీరజ్‌రెడ్డి 220 ర్యాంక్, బి.రిత్విక్ 340వ ర్యాంక్, వివిధ కేటగిరిల్లో బి.రిత్విక్ 52వ ర్యాంక్, టి.జస్మిత 89, లూథర్‌కింగ్ 95, వి.వెంకటసాత్విక్ 110, పి.ఉభయేంద్ర 192, జి.నీరజ్‌రెడ్డి 220, పి.రాహుల్ 258, పి.రోహిత్‌సాయిఅన్వేశ్ 267, బి.రిత్విక్ 340, ఎం.ధ్యానతేజ 395, బి.ప్రియాంక 406, పి.ప్రమోద్ 414, డి.సాయిశ్రీరామ్ 415, కె.భవ్య 446, బి.ఇందు 473, గణేశ్‌సాయి 482, ఎం.గోకుల్‌సాహితి 513, పి.రోహిత్ 529, పి.బిన్ను 643, బి.జనీత్ 647, జె.చేతన్ 667, ఎల్.లోహిత్ నంద్‌నాయక్ 730, జి.రిత్విక్ 772, బి.జశ్వంత్ సింగ్ రాథోడ్ 825, ఎ.లిఖితపవన్ 901, ఎ.రాహుల్‌సాయి 1046, జి.విజయభవాని 1053, పి.వరుణ్ 1081, టి.వివేక్ 1204, వి.వెంకటసాత్విక్ 1,229వ ర్యాంకులు సాధించారన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ మినహా ఏ ఇతర జిల్లాల్లో సాధించని ఘనత కేవలం న్యూవిజన్‌కే సాధ్యమని ప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో గోపిచంద్, కార్తీక్, బ్రహ్మచారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



220వ ర్యాంక్ సాధించిన నీరజ్‌రెడ్డిని అభినందిస్తున్న న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్

ఐఏఎస్ అవుతా...

ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఆ దిశగా ఇష్టంతో కష్టపడి చదువుకొని సమాజ సేవ చేయాలనుకుంటున్నాను. మా తల్లిదండ్రులు, కళాశాల ప్రోత్సాహం బాగుంది. భవిష్యత్‌లో మంచి మార్కులు రావాలంటే ఏంచేయాల్సి ఉంటుందనే విషయాలు బోధించడంతోనే ఇంత మంచి ర్యాంక్ సాధించగలిగాను.

– గూడురు నీరజ్‌రెడ్డి, జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్, న్యూవిజన్

● కృష్ణవేణి హవా

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లతో విజయకేతనం ఎగురవేశారని కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపుడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలిండియా స్థాయిలో వివిధ కేటగిరిల్లో జి.విజయ్ 31వ ర్యాంక్, టి.జనేషు 153, టి.నేహశ్రీ 523, బి.కౌశిక్ 534, డి.విగ్నేశ్ 585, డి.మనోజ్ 701, బి.యశ్విత 722, డి.యశ్వంత్ తేజ 758, జె.సోని 831, బి.నిశాంత్ 878, బి.గోపి 1,014, ఎస్.వెంకట సాయితేజ 1,112, బి.సాద్విక 1,140, కె.శ్రీమాన్‌రావు 1,145, బి.చైతన్య 1,199వ ర్యాంక్‌లు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం రామచందర్‌రావు, ఏఓ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.



ర్యాంకర్‌ను అభినందిస్తున్న కృష్ణవేణి యాజమాన్యం

● హార్వెస్ట్ సత్తా

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. ఎల్.వెన్నెల ఆలిండియా స్థాయిలో 548 ర్యాంక్, బి.సంతోష్‌కుమార్ 692వ ర్యాంక్, ఎం.వినయ్‌కుమార్ 832, టి.సౌమ్యశ్రీ 992, ఎ.భానుప్రకాష్ 1,066, యు.మోహన్‌సాయి 1,183, కె.భావనశ్రీ 1,600, ఎ.జశ్వంత్ 2,441, తనుష్కాపతాని 2,987, ఎల్.ప్రహ్లాద్ 3,409, కె.నవదీప్ 3,424, యు.హర్షదీప్‌సాయి 3,451, పి.లతాశ్రీ 4,521, వి.దేదీప్య 4,662, జి.రిషిత 7,826, ఎస్.అక్షర 13,489, పి.శివలాస్య 13,873, ఎం.ప్రీతమ్‌గాంధీ 18,216, టి.చేతన్‌తన్మయి 19,516, వి.గాయత్రికృష్ణ 22,498 ర్యాంక్ సాధించారన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హార్వెస్ట్ యాజమాన్యం

● శ్రీచైతన్య విజయదుందుబి



విజయచిహ్నం చూపుతున్న విద్యార్థులు, యాజమాన్యం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లతో సత్తా చాటారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. బి.భరత్‌కుమార్ 14వ ర్యాంక్, జి.విశాల్ 66, జి.మణిప్రకాష్ 83, బి.వివేక్‌వర్ధన్ 147, ఎం.జగన్ చంద్ర 172, కె.ట్వింకిల్‌పార్నికా 190, ఎ.ఇందు 214, బి.నరేశ్ 217, జె.ప్రణీత్ 219, కె.శివగుప్త 221, వి.భానుప్రసన్న 264, టి.హర్షవర్ధన్ 267, ఎం.నాగేంద్ర 369, పి.హర్షిత్ 383, బి.ప్రవీణ్ 410, ఎం.వంశీ 518, ఎం.అరుణ్‌కుమార్ 533, బి.ప్రేమేందర్ 602, ఎం.ఉపేందర్ 603, బి.భానుప్రకాష్ 703, కె.సాయివైష్ణవి 752, బీకే చక్రవర్తి 779, పి.భరత్‌చంద్ర 830, బి.జగదీశ్ 962, బి.పూజిత 984, బి.కీర్తనవర్మ 990వ ర్యాంక్ సాధించారన్నారు. కార్యక్రమంలో బి.సాయిగీతిక, చేతన్‌మాథూర్, వర్మ, బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఐపీఎస్‌నవుతా...

చిన్నతనం నుంచి ఇష్టపడి చదువుకుంటున్నాను. ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం. అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరిలో 383వ ర్యాంక్ సాధించటం ఆనందంగా ఉంది. మా తల్లిదండ్రులు, కళాశాల సహకారం వల్లే మంచి ర్యాంక్ సాధించగలిగాను. నిత్యం చదువులో మెళకువలు చెబుతూ మంచి మార్కులు సాధించేలా అవగాహన కల్పించారు.

–పి.హర్షిత్‌చౌదరి, జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్, శ్రీచైతన్య

● రెజొనెన్స్ విజయకేతనం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించి ప్రభంజనం సృష్టించారని రెజొనెన్స్ కళాశాలల డైరెక్టర్స్ ఆర్‌వీ నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు పేర్కొన్నారు. సీహెచ్ పాంటింగ్ 324వ ర్యాంక్, ఎల్.భరత్‌కుమార్ 341, రాజేశ్ 379, మల్లేశ్ 724, అశోక్ 802, ప్రభాస్ 1,827, సాయిచరణ్ 1,834, లక్ష్మీసాయి 3,668వ ర్యాంక్‌లు సాధించారన్నారు. ప్రిన్సిపాళ్లు సతీశ్, ఎం.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న రెజొనెన్స్ యాజమాన్యం

ఓటర్ల జాబితాలో సర్పంచ్ పేరు తొలగింపు

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ విజయ్‌కుమార్ ఆదివారం బీఎల్‌ఓలు తీసుకొచ్చిన ఓటర్ లిస్టును పరిశీలించగా తన పేరు లేకపోవడంతో ఖంగుతిన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపేరు ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదని, తిరిగి దరఖాస్తు చేసుకుంటానని చెప్పారు.

సన్నిధి

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు ఉత్థం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మనాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే

సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ

మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అమలులో నిలపాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!



నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్ల తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.

పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మ బంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంత కన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు. అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?



రవితేజ

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.

వారికి కాజల్ ఓ ఉదాహరణ

– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లు లాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!



మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా


– నందితా శ్వేత



అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

మా నాన్న సూపర్ హీరో!



సుధీర్‌బాబు

'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.


ఇదేం జీవితం?



రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాన్నీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాన్నీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. ఛాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

సంక్రాంతికి జాతర



ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

అమ్మ ఒడితో 100 శాతం సత్ఫలితాలు

రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లుగా జీఈఆర్ పెరుగుదల

ప్రాథమిక విద్యలో జాతీయ స్థాయిని మించి విద్యార్థుల చేరికలు

విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే కారణం

టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైనా రెగ్యులర్‌గా చేరేందుకు అనుమతి

వారికి కూడా అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద

ప్రాథమిక విద్యలో జీఈఆర్ పెరుగుదల



సెకండరీ విద్యలో జీఈఆర్ పెరుగుదల



ఉన్నత విద్యలో జీఈఆర్ పెరుగుదల



సాక్షి, అమరావతి: విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలతో ముఖ్యంగా జగనన్న అమ్మఒడి ద్వారా నూటికి నూరు శాతం సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. అమ్మ ఒడి ద్వారా ప్రాథమిక విద్యలో జాతీయ స్థాయిని మించి చేరికలు నమోదైనట్లు వెల్లడైంది. గతేడాది ప్రాథమిక విద్యలో జాతీయ స్థాయిలో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) 100.13 ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 100.80కి చేరింది. అమ్మ ఒడి ద్వారా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, సెకండరీ విద్యలో జీఈఆర్ పెరిగినట్లు ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల, జిల్లా స్థాయిల్లో నూరు శాతం జీఈఆర్ నమోదుకు కృషి చేయాలని సూచించారు.

రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లుగా ప్రాథమిక, సెకండరీ, ఉన్నత విద్యలో జీఈఆర్ పెరుగుతూ వస్తోంది. 2020 జనవరి 9వతేదీన జగనన్న అమ్మ ఒడి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అమ్మ ఒడి పథకం కింద ఇప్పటి వరకు 44,48,865 మంది తల్లుల ఖాతాల్లో రూ.19,674.34 కోట్లు జమ చేశారు. 2023–24కి సంబంధించి ఈ నెల 28న అమ్మ ఒడి నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

- ప్రాథమిక విద్యలో 2018లో జాతీయ స్థాయిలో జీఈఆర్ 96.09 ఉండగా రాష్ట్రంలో 92.91 ఉంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అమ్మ ఒడితో పాటు పలు పథకాలను అమలు చేయడంతో 2019–20 నుంచి వరుసగా ప్రాథమిక విద్యలో జీఈఆర్ పెరుగుతూ 2022–23 నాటికి జాతీయ స్థాయిని మించి 100.80కి చేరింది. సెకండరీ విద్యలో 2018–19లో జీఈఆర్ 79.69 ఉండగా 2022–23 నాటికి 89.63కి చేరింది. ఉన్నత విద్యలో రాష్ట్రంలో 2018–19లో జీఈఆర్ 46.88 ఉండగా 2022–23 నాటికి 69.87 శాతానికి జీఈఆర్ పెరగడానికి ప్రధాన కారణం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన తదితరాలు కారణమని స్పష్టం అవుతోంది.

- టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు చదువు మానేస్తున్నారు. ఉన్నత విద్యలో జీఈఆర్‌ను మరింత పెంచడంపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం అలాంటి వారిని రెగ్యులర్ తరగతుల్లో అవే కోర్సుల్లో తిరిగి చేర్చుకునేందుకు అనుమతించింది. ఈమేరకు మిషన్, విజన్ పేరుతో ఈ ఏడాది ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను వలంటీర్ల ద్వారా అమలు చేస్తోంది. అంతేకాకుండా పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలై తిరిగి రెగ్యులర్ తరగతుల్లో చేరిన విద్యార్థులకు కూడా జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను వర్తింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

అదే డైలాగ్ వన్స్‌మోర్!

- ఎన్నికలప్పుడే ప్రాణహాని అంటున్న పవన్‌కల్యాణ్
- నన్ను చంపేస్తారేమో అంటూ సానుభూతి పొందే యత్నం
- గత అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు ఇవే మాటలు
- కాపుల ఓట్లు వైఎస్సార్‌సీపీకి పడకుండా చూసే వ్యూహం
- ఆ ఎన్నికల్లో ఏ మాత్రం పనిచేయని సానుభూతి డ్రామా
- అయినా మళ్లీ అవే మాటలతో తాజాగా బాబుకు లబ్ధి చేకూర్చే యత్నం
- పవన్ తీరుపై జన సైనికుల్లోనే ఆందోళన
- స్క్రిప్టు, మాటలు, చేతలకు పొంతన కుదరడం లేదని ఆవేదన

సాక్షి, అమరావతి : సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలు జరిగే ఏడాది ముందు ప్రతిసారి సినీ నటుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 'నాకు ప్రాణహాని ఉంది' అంటూ వ్యాఖ్యానించడం అలవాటుగా మారింది. తాజాగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన పార్టీ నాయకుల సమావేశంలోనూ అదే డైలాగ్ వల్లె వేశారు. 'నాకు ప్రాణహాని ఉంది. సుపారీ గ్యాంగులను ప్రత్యేకంగా దింపారనే సమాచారం ఉంది' అని ప్రకటించడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలన్న వ్యూహం దాగి ఉందని ఇట్టే తెలుస్తోంది. గత (2019) అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు అచ్చం ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. 2018 జులై 7న విశాఖపట్నం జిల్లా పర్యటనలో 'నా కారు యాక్సిడెంట్ చేసి చంపేస్తామని, బాంబులు పెట్టి పేల్చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు' అంటూ వ్యాఖ్యానించారు. ఆ తర్వాత పలు చోట్ల ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఇలానే మాట్లాడుతూ రాజకీయ ప్రచారం కొనసాగించారు.

ఆ డైలాగ్ వర్కవుట్ కాకపోయినా...

పవన్ కల్యాణ్ ఏం చేసినా... అది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకే అనే విషయం రాష్ట్రంలో జన సైనికులతో సహా అందరికీ తెలుసు. ప్రత్యేకించి ఒక సామాజికవర్గం నుంచి మరింత సానుభూతి పొందడం ద్వారా వీలైనంత మేర ఆ సామాజిక వర్గం ఓట్లను అధికార వైఎస్సార్‌సీపీకి దూరం చేయాలన్న ఎత్తుగడతోనే గతంతో వర్క్ అవుట్ కాని డైలాగ్‌ను పవన్ మళ్లీ వల్లె వేశారు. 2019 ఎన్నికల సమయంలో కాపు రిజర్వేషన్ల ఉద్యమకారుడు ముద్రగడ పద్మనాభం పట్ల అప్పటి చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ఆ సామాజికవర్గం తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఉండింది. ఆ కారణంగా ఆ వర్గం ఓట్లన్నీ గంపగుత్తగా అప్పటి ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీకి పడకుండా ఉండేందుకు పవన్‌కల్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. 2014 ఎన్నికల ముందే జనసేన పార్టీని స్థాపించినప్పటికీ.. ఆ ఎన్నికల్లో ఒక్క సీటులో కూడా పోటీ చేయకుండా టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడానికి పవన్ సహకరించిన విషయం బహిరంగ రహస్యం.

తప్పులో కాలేయడమే!

ఆ తర్వాత నాలుగేళ్లపాటు ప్రతి అంశంలో చంద్రబాబు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. తీరా ఎన్నికలకు ఏడాది ముందు.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడం ద్వారా చంద్రబాబుపై కోపంగా ఉన్న వారి ఓట్లు అప్పటి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి పడకుండా చూసేందుకు విఫలయత్నం చేశారు. ఆ సమయంలో 'నాకు ప్రాణ హాని ఉంది' అనే డైలాగ్ పుట్టుకొచ్చింది. 'టీడీపీ ప్రభుత్వ దోపిడీని బయట పెడుతున్నానని నా కారుకు యాక్సిడెంట్ చేసి చంపేస్తామని, బాంబులు పెట్టి పేల్చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు' అంటూ చిలక పలుకులు పలికారు. ఆ సానుభూతి డ్రామా ఆ ఎన్నికల్లో ఏ మాత్రం పనిచేయలేదు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యంగా మళ్లీ అదే డైలాగ్‌ను వదలడం పట్ల జన సైనికులే పెదవి విరుస్తున్నారు. తమ అధినేత స్క్రిప్టు, మాటలు, చేతలకు ఏమాత్రం పొంతన కుదరడం లేదని వాపోతున్నారు. 'అయినా పవన్ కల్యాణ్‌కు ఏదైనా జరిగితే ఎవరికి ఉపయోగం? చంద్రబాబుకే కదా.. ఆ విషయాన్ని పదే పదే ఎల్లో మీడియాలో చూపించి లబ్ధి పొందడంలో చంద్రబాబును మించిన వారెవరూ ఉండరు కదా.. ఈ మాత్రం రాజకీయం అర్థం కాని వారెవరు? మా అధినేత మళ్లీ తప్పులో కాలేస్తున్నారు' అని జనసేన అభిమాని ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

గెలుస్తాననే నమ్మకం నాకు లేదు



నన్ను చంపేస్తామని బెదిరింపులు వస్తున్నాయి

నోటా ఓట్లు జనసేనకు వేయండి

కాకినాడ సభలో పవన్‌కల్యాణ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'నేను గెలుస్తాననే నమ్మకం నాకు లేదు. కానీ, పోరాటం మాత్రం ఆపేది లేదు'.. అని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. 'కిందించి మేలెంచాలనే ఈ విషయం మీకు చెబుతున్నాను. నన్ను చంపేస్తామని బెదిరింపులు వస్తున్నాయి. అయినా భయపడేదిలేదు. కులాన్ని చూడకండి. తెలంగాణ ప్రజల మాదిరిగా కులం కంటే నా ఆంధ్రా అనే భావన అందరిలోనూ రావాలి'.. అని ఆయనన్నారు. వారాహి యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి జిల్లా కేంద్రమైన కాకినాడలోని సర్పవరం జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. 'మీరు అండగా నిలబడితే నేను, జనసేన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్తాం. నాకు ఫలానా కులం ఎక్కువ, మరో కులం తక్కువ అనేది లేదు. అధికారం లేకున్నా 2008 నుంచి మీకోసం పోరాడుతూనే ఉన్నాను'.. అని చెప్పారు. రాజకీయం వేరు, సినిమాలు వేరని అన్నారు. సభలకు రావడం కాదు.. ఎన్నికల్లో ఓటేసి సత్తా చాటాలని, గత ఎన్నికల్లో పార్టీలపై కోపంతో నోటాకు వేసిన 3–4 శాతం ఓట్లను ఈసారి జనసేనకు వేయాలని పవన్ వేడుకున్నారు. మధ్యతరగతి మేధావులు మౌనంగా ఉండటమే ప్రశాంత ఆంధ్రప్రదేశ్ క్రిమినల్ అడ్డాగా మారడానికి కారణమని ఆయన ఆరోపించారు. అన్యాయం జరుగుతున్నప్పుడు యువత మేలుకోకపోతే అరాచకాలు పెరిగిపోతాయన్నారు.

దళితులకు సీఎం అన్యాయం చేశారు

దళిత యువతకు సంబంధించిన 18 పథకాలు రద్దు చేసిన ఈ ముఖ్యమంత్రిని ఏమనాలని పవన్ ప్రశ్నించారు. అంబేడ్కర్ విదేశీ విద్యను జగనన్న విదేశీ విద్యగా మార్చుకుని దళితులకు అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని డీజీపీ చెబుతున్న దానికి, వాస్తవ పరిస్థితికి అసలు పోలికేలేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని డీజీపీ చెబుతున్న తీరు సరికాదన్నారు. రాష్ట్రంలో క్రిమినల్ ఎంపైర్‌ను నేలమట్టం చేసి, సీఎంను రోడ్డు మీదకు తీసుకువస్తానన్నారు.

నన్ను ఓడించడానికి రూ.200 కోట్లు ఖర్చు..

ఇక భీమవరంలో ఉన్న ఓటింగ్ కంటే అధికంగా ఓటింగ్ జరిగిందని.. తనను ఓడించేందుకు రూ.200 కోట్లు ఖర్చుచేయాలనుకుంటున్నారని పవన్‌కళ్యాణ్ చెప్పారు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితిపై గతంలో జనసైనికులు ఫొటోలు తీసి దేశం దృష్టికి తీసుకువెళ్లినట్లుగానే హ్యాష్‌ట్యాగ్ ద్వారా ఇక్కడ జరుగుతున్న అవినీతి, దోపిడీపై ఫొటోలు తీసి కేంద్ర హోంశాఖ, రాష్ట్ర డీజీపీ, జనసేన కార్యాలయాలకు ట్యాగ్ చేయాలని పవన్ తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

బాబు నుంచే పవన్‌కు ముప్పు!

- ఓ కన్నేసి ఉంచు తమ్ముడూ!
- ఏపీ డిప్యూటీ సీఎం సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తనకు ప్రాణహాని ఉందని ఎందుకన్నారో తెలియదుగానీ అయితే అది చంద్రబాబు నుంచే ఉందని గ్రహించాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. 'తమ్ముడూ పవన్.. చంద్రబాబుపై ఓ కన్నేసి ఉంచు! ఆయన్ను ఓ కంట కనిపెడుతూ జాగ్రత్తగా ఉండాలి' అని హెచ్చరించారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉండగా పేదల నాయకుడు వంగవీటి మోహన్‌రంగా హత్యకు పన్నాగం పన్నిన వారిలో చంద్రబాబు హస్తం ఉందని చెప్పారు. పవన్ కల్యాణ్‌కు ఏదైనా జరిగితే ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీ పైకి నెట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పవన్ కల్యాణ్ పాలిచ్చే ఆవును వదిలేసి తన్నే దున్నపోతు లాంటి చంద్రబాబును విశ్వసిస్తున్నారని వ్యాఖ్యానించారు. పవన్ వెనుక తిరుగుతున్న వారంతా తమ పరిస్థితి కుక్కతోక పట్టుకొని గోదారి ఈదినట్లు అవుతుందని భయపడుతున్నట్లు చెప్పారు. స్థిరత్వం లేని మాటలతో ప్రజల్లో చులకన కావద్దని పవన్‌కు మంత్రి సత్యనారాయణ హితవు పలికారు. గతంలో తనకు ముఖ్యమంత్రి అయ్యే సీన్ లేదన్న పవన్ ఇప్పుడు అందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో పవన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించగలరా? అని చంద్రబాబుకు సవాల్ విసిరారు.

జిల్లా వార్తలు

రామాలయంలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం ఖమ్మం జిల్లాకు చెందిన భక్తులు విరాళం ఇచ్చారు. మధిర పట్టణంలోని ముస్లిం బజారుకు చెందిన కొల్లి వెంకట సత్యనారాయణ, తిరుమల రత్న శిరీష దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది సాయిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలంలోని కిన్నెరసానికి ఆదివారం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులు, డ్యామ్ పై నుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం బోటు షికారు చేశారు. 311 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.11 వేలు, 200మంది బోటింగ్ చేయడం ద్వారా పర్యాటక శాఖకు రూ.11వేలు.. మొత్తం రూ.22 వేల ఆదాయం సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు.

మక్కల కొనుగోళ్లు పూర్తి

- ఉమ్మడి జిల్లాలో 67 వేల మెట్రిక్ టన్నుల సేకరణ
- విలువ రూ.113 కోట్లు
- నాణ్యమైన పంట కొనుగోళ్లకే మార్క్‌ఫెడ్ ప్రాధాన్యత
- నాణ్యత లేని పంటను వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకున్న రైతులు



వనంవారి కిష్టాపురంలో మక్కల కొనుగోళ్లు

ఖమ్మంవ్యవసాయం: గత యాసంగి సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో యాసంగి సీజన్‌లో పండించిన మొక్కజొన్నను కొనుగోలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.113.16 కోట్ల విలువైన 67,711 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలను సేకరించారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం మక్కలకు క్వింటాకు రూ.1,962 మద్దతు ధర ప్రకటించగా ప్రైవేటు వ్యాపారులు రూ.1,200 నుంచి రూ.1,700 ధర చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో రైతులకు కనీస మద్దతు ధర దక్కలేదు. దీనికి తోడు మొక్కజొన్న పంట కంకి, కోత దశల్లో అకాల వర్షాలు సంభవించాయి. ఈదురుగాలులకు పైరుపైనే పంట నేలవాలి దెబ్బతిన్నది. కోత దశలో ఉన్న కంకి బూజుపట్టింది. నాణ్యత సైతం తగ్గింది. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ధర మరింత తగ్గించి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం మక్కల కొనుగోళ్లకు ముందుకొచ్చింది. మొక్కజొన్న పండించే ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్‌ను ఆదేశించింది. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొక్కజొన్న పంట సాగు చేసిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.


లక్ష్యం చేరని కొనుగోళ్లు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మక్కల కొనుగోళ్ల నిర్దేశించిన లక్ష్యాన్ని చేరలేదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సమృద్ధిగా నీరుండడంతో యాసంగి పంటగా రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో 91,225 ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 28,290 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఈ మొత్తం సాగుతో 70 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలో 44 కేంద్రాల ద్వారా 50 వేల మెట్రిక్ టన్నులు, భద్రాద్రి జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల ద్వారా 20 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అయితే మార్క్‌ఫెడ్ సంస్థ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)ల ద్వారా 67,711 మెట్రిక్ టన్నుల మక్కలను మాత్రమే కొనుగోలు చేసింది. ఖమ్మం జిల్లాలో 37 కేంద్రాలు ప్రారంభించినప్పటికీ 34 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు జరిపారు. పీఏసీఎస్ ద్వారా 28, డీసీఎంఎస్ ద్వారా ఆరు కేంద్రాల నుంచి 11,090 మంది రైతులకు చెందిన 64,328.100 మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేశారు. ఈ పంట విలువ రూ.107 కోట్లు కాగా, ఈ మొత్తంలో రూ.98 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సఘాల ద్వారా 11 కేంద్రాలను ఏర్పాటు చేసి 510 మంది రైతులకు చెందిన 3,383 మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేశారు. ఈ మొత్తం పంట విలువ రూ.6.16 కోట్లు కాగా, ఇప్పటివరకు రైతులకు రూ.5.41కోట్లు చెల్లించారు.

నాణ్యత లేని పంట తక్కువ ధరకే..

అకాల వర్షాలకు నాణ్యత కోల్పోయిన పంటను ప్రభుత్వం కొనుగోళ్లు చేయకపోవడంతో దిక్కులేని స్థితిలో రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించుకోక తప్పటం లేదు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 1962 కాగా ప్రైవేటు వ్యాపారులు నాణ్యతను బట్టి రూ. 1200 నుంచి రూ.1700 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఓ వైపు అకాల వర్షాలతో కొంత పంట నష్టపోగా, పండిన పంట కూడా నాణ్యత కోల్పోవడంతో కనీస మద్దతు ధర కూడా పొందక రైతులు నష్టపోతున్నారు.

లక్ష్యానికి దగ్గరగా కొనుగోళ్లు జరిపాం



ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి నిర్దేశించిన లక్ష్యానికి దగ్గరగా మక్కల కొనుగోళ్లు చేశాం. పంట సాగు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.113 కోట్ల విలువైన 67 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలను రైతుల నుంచి కొనుగోలు చేశాం. మక్కలు విక్రయించిన రైతుల ఖాతాల్లో నగదు చెల్లింపులు కొనసాగుతున్నాయి.

– ఎం.సునీత, ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్

బీజేపీ పేదలు, రైతుల పక్షపాతి

- జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు
- కేంద్ర సహాయ మంత్రి బి.ఎల్.వర్మ



మాట్లాడుతున్న మంత్రి బి.ఎల్.వర్మ

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదలు, రైతుల పక్షపాతి అని, అన్ని వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా పాలన సాగిస్తున్నామని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి బి.ఎల్.వర్మ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో పేదల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. రైతులకు సబ్సిడీ ఎరువులతో పాటు పంటల ఉత్పత్తులకు మద్దతు ధరలు పెంచిందని చెప్పారు. రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.27 వేల కోట్లు జమ చేశామని తెలిపారు. కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు కాకుండా ఇక్కడి ప్రభుత్వం అడ్డుకుంటోందని, ఆ పథకాలకు వచ్చే నిధులను ప్రభుత్వం వినియోగించుకుంటోందని ఆరోపించారు. 2013 – 14 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022 – 23లో వ్యవసాయ బడ్జెట్ 5.7 రెట్లు పెరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. నాడు దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే.. బీజేపీ వచ్చిన తర్వాత 149కి పెంచామన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణాలకు రూ.10 వేల కోట్లు కేటాయించామన్నారు. వరంగల్ రామప్ప దేవాలయం, భద్రాచలం రామాలయం అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని అన్నారు. ఖమ్మంలో రూ.30 కోట్ల విలువైన స్థలాన్ని షాదీఖానాకు కేటాయించారని, ఈ స్థలాన్ని గతంలో గోశాలకు కేటాయించాలని అడిగారన్నారు. గోశాలకు ఇవ్వకుండా షాదీఖానాకు కేటాయించారని, ఇప్పటికే ఒక షాదీఖానా ఉండగా.. మరో షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, బీజేపీ అధికారంలోకి వస్తే ఆ స్థలాన్ని గోశాలకు కేటాయిస్తామని అన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇళ్లు నిర్మించామని, 1.88 కోట్ల ఇళ్లకు మంచినీటి పంపు కనెక్షన్లు పెట్టించామని, స్వచ్ఛ భారత్ కింద 11.72 కోట్ల మరుగుదొడ్లు నిర్మించామని వివరించారు. ముద్ర యోజన కింద చిన్న పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించామన్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలన్నా.. ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలన్నా అది బీజేపీతోనే సాధ్యమవుతుందని చెప్పారు. సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అల్లిక అంజయ్య, నున్నా రవికుమార్, రుద్ర ప్రదీప్, శ్యామ్ రాథోడ్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం పురోగమనం

ఖమ్మంరూరల్/ఖమ్మంమామిళ్లగూడెం: ప్రధానిగా నరేంద్రమోదీ అధికారం చేపట్టిన తొమ్మిదేళ్లలో దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని బి.ఎల్. వర్మ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో ఆదివారం జరిగిన బీజేపీ అనుబంధ సంయుక్త మోర్చాల సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ తెగకు చెందిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీదేనని తెలిపారు. పార్లమెంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 27 మంది ఓబీసీ కులాల వారిని కేబినెట్‌లో తీసుకోవడం మోదీ గొప్పతనమని తెలిపారు. సమావేశంలో నాయకులు బోడా ప్రకాష్, తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, గెంటేల విద్యాసాగర్‌రావు, అనంత్, ఉపేందర్‌గౌడ్, రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య, భద్రం, కె.వెంకన్న, కొలిపాక శ్రీదేవి పాల్గొన్నారు.

ఎండల్లో హాయ్.. హాయ్!



బైక్‌కు టాప్ ఏర్పాటు చేసుకుని వెళుతున్న వాహనదారుడు



రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాద్రి జిల్లాలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండవేడిమి తాళలేక ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. దీంతో ఎండ నుంచి కాపాడుకునే చిట్కాలపై పలువురు దృష్టి సారిస్తున్నారు. కొత్తగూడెం – పాల్వంచ రోడ్డులో ఆదివారం ఇలా ఓ వ్యక్తి కుటుంబసభ్యులతో కలిసి బైక్‌పై వెళుతూ ఎండ తగలకుండా టాప్ ఏర్పాటు చేసుకోగా పలువురు ఆసక్తిగా తిలకించారు. ఎండతో పాటు చిరుజల్లుల నుంచి కూడా ఈ టాప్ ఉపశమనం కలిగిస్తుంది. ఈ దృశ్యాన్ని ఆదివారం పాత పాల్వంచ వద్ద 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. – పాల్వంచ

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటాం

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ మార్కెట్లలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎప్పుడూ అండగా ఉంటామని ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాడేపల్లి కిరణ్‌కుమార్ అన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్లలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఆదివారం ఖమ్మం మార్కెట్ పత్తియార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ కల్లూరు యూనిట్ అధ్యక్షుడు వజీరుద్దీన్, జిల్లా కోశాధికారి ఎండీ హిమాయిత్ హుస్సేన్, మార్కెట్ కమిటీ రాష్ట్ర సెక్యూరిటీ గార్డ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రాము, ఉపాధ్యక్షుడు ఎండీ ముస్తాక్, ఉమ్మడి జిల్లా సెక్యూరిటీ గార్డ్స్ సంఘం అధ్యక్షుడు ఎండీ మహమూద్, కార్యదర్శి బి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్. కన్నయ్య, టి. చంద్రకాంత్, శంకర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేఎం నర్సింహస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఆసీఫ్‌ఖాన్, కోశాధికారిగా రవి, ఉపాధ్యక్షులుగా నరసింహారావు, నాగేశ్వరరావు(దమ్మపేట), సహాయ కార్యదర్శులుగా ఆర్. నాగరాజు(నేలకొండపల్లి), మధు(ఇల్లెందు), గౌరవ అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు(ఖమ్మం), గౌరవ సలహాదారులుగా జీడీ ఉపేందర్(ఖమ్మం), ఈసీ సభ్యులుగా సీహెచ్ ఉమ(ఖమ్మం), పద్మ(మద్దులపల్లి), సురేష్ (చర్ల), వెంకటేశ్వర్లు(కొత్తగూడెం) సుబ్బారావు(బూర్గంపాడు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.